క్లుప్తంగా

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



పామర్రు: ఏపీ ఎన్జీవో ఆధ్వర్యంలో ఈనెల 21, 22 తేదీల్లో విజయవాడలో నిర్వహించే రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ బుధవారం సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సంఘ నాయకులు ఎమ్మెల్యేను కలిసి మహాసభ వివరాలను వెల్లడించారు. సభలకు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడిశెట్టి శ్రీనివాసరావు, దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, కాకర్ల వెంకటేశ్వరరావు, మారపాక మహేష్, అధికారులు సీహెచ్‌రాము తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో ఇబ్బందులు తొలగించాలి

గుడివాడ టౌన్: టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంక్ రుణాలకు సంబంధించిన సాంకేతిక ఇబ్బందులను తొలగిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చెయ్యాలని 5వ వార్డు కన్వీనర్ వెంపల అప్పారావు కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణకు ప్రభుత్వం విడుదల చేసిన జీవోను అమలు చేయాలని కోరారు. లబ్ధిదారులు అధైర్యంతో ఉన్నారని కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆధ్వర్యంలో 8,912 టిడ్కో గృహాల నిర్మాణం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరికీ రుణం ఇచ్చేందుకు బ్యాంకు అధికారులతో చర్చించి రుణాలు వేగంగా అందేలా చూడాలని వినతిపత్రం సమర్పించారు.

విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ



మండవల్లి: మండలంలోని కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కళ్లకలక వ్యాధి వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యగా గ్రామానికి చెందిన శొంఠి కుమారస్వామి 250 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎస్‌వై.మాధవకుమార్, ఉపాధ్యాయులు కుమారస్వామిని అభినందించారు. హెచ్‌ఎం మాధవకుమార్ కంటికి సంబంధించిన వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు కె.శ్యామ్‌ప్రసాద్, భాగ్యకుమారి, శివ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరిగడ్డి లారీ దగ్ధం



నిడుమోలు(మొవ్వ): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో లారీపై వరి గడ్డి దగ్ధమవగా.. లారీ పాక్షికంగా దెబ్బతింది. పామర్రు ఫైర్ అధికారి ఎస్.రాంబాబు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నిడుమోలు శివారులో సీహెచ్ రామాంజనేయులుకి చెందిన వరిగడ్డిలోడు లారీ మంత్రిపాలెం నుంచి గూడూరు మండలం తరకటూరుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మంత్రిపాలెం శివారులో లారీపై గడ్డి విద్యుత్ వైర్లకు తగలటంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 50 వేల ఆస్తి నష్టం వాటిల్లగా పామర్రు ఫైర్ అధికారి, సిబ్బంది సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. దీంతో రూ.4 లక్షలు విలువైన ఆస్తిని కాపాడామని వెల్లడించారు.

వరి రైతులు భయపడొద్దు



కైకలూరు: విస్తార వర్షాల కారణంగా చేలు ముంపు బారిన పడిన రైతులు భయపడొద్దని ఏరువాక శాస్త్రవేత్తలు భరోసా ఇచ్చారు. కైకలూరు సబ్‌డివిజన్ పరిధిలోని కైకలూరు మండలం ఆచవరం, వింజరం, తామరకొల్లు, కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామాల్లో వరి పొలాలను బుధవారం పరిశీలించారు. ముంపునకు గురైన పొలాలు త్వరగా కోలుకోడానికి బ్లయిటాక్స్ (కాపర్ ఆక్సీక్లోరైడ్ 50 శాతం డబ్ల్యూపీ) 500 గ్రాములు ఒక ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. పొటాష్ 25 కేజీలు, యూరియా 20 కేజీలు పొలాల్లో చల్లుకోవాలన్నారు. కొన్ని పొలాల్లో సూక్ష్మ పోషకాల లోపలున్నాయని, దీని నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి 5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. వెద పద్ధతిలో పొలాలను దున్నినప్పుడు కలుపు సమస్యకు పరిష్కారంగా పిండిమిథాలిన్‌ను స్ప్రే చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో లోన్‌డాక్స్ పవర్ గుళికలను 4 కేజీలు ఎకరాకు ఇసుకలో కలిపి చల్లుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు పి.సుజాత, కె.ఫణికుమార్, ఎ.రాజేష్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లలిత సుధ, కైకలూరు ఏడీఏ గంగాధరరావు, కైకలూరు ఏవో దివ్య, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- నియోజకవర్గాల్లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు, టీహెచ్‌ఆర్ పంపిణీ
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గుడివాడరూరల్: ఆరోగ్యవంతమైన సమాజం కోసం బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ పోషణ అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లాయపాలెం సచివాలయం వద్ద వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొళ్ల రామకృష్ణ, ఎంపీడీవో వెంకటరమణ, సీడీపీవో విజయ ఫ్లోరెన్స్‌తో కలసి బుధవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత బాలింతలు, గర్భిణులు 25 మందికి వైఎస్సార్ పోషణ కిట్లను అందజేశారు. ఈ కిట్లలో 3 కిలోల బియ్యం, కేజీ పప్పు, 500 గ్రాముల ఆయిల్, 25 కోడిగుడ్లు, ఐదులీటర్ల పాలతో పాటు మరో ఐదు రకాలు కలిపి మొత్తం 10 రకాలను కిట్ల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గర్భవతులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు మురాల నగేష్, బోయిన చంటి, సుబ్బారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: పౌష్టికాహారంతోనే మంచి ఆరోగ్యం సాధ్యమని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో ఐసీడీఎస్ ఆధ్వర్యాన టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. గర్భవతులు, బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యకరంగా ఉండాలని రాజామణి సూచించారు. ప్రతి తల్లి పౌష్టికాహారం తీసుకుంటే రాగల తరంగా బలంగా, ఆరోగ్యంగా ఉంటుందని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ మాధవి అన్నారు. టేక్ హోం రేషన్ పంపిణీలో భాగంగా గర్భవతులు, బాలింతలకు మూడు కేజీల బియ్యం, కందిపప్పు కేజీ, అరకిలో వంట నూనెతోపాటు గుడ్లు, పాలు, వైఎస్సార్ కిట్‌లను ఎంపీపీ రాజామణి, సర్పంచ్ పెనుమత్స రాధిక, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, తహసీల్దార్ కుసుమకుమారి పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు కోకిలారాణి, భాగ్యం, విజయ, మల్లీశ్వరి, రాణి, లక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.



టీహెచ్‌ఆర్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ పుష్పరాణి, జెడ్పీటీసీ రామకృష్ణ, అధికారులు

పామర్రు: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి ఒక్క గర్భిణికి, బాలింతకు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని అందజేస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమర్, జెడ్పీటీసీ కె.స్వరూపరాణి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. టీహెచ్‌ఆర్ కిట్‌లో 3 కేజీల బియ్యం, ఒక కేజీ పప్పు, అరకేజీ నూనె, రెండు కేజీల రాగిపిండి, కేజీ అటుకులు, పప్పు చెక్క 250 గ్రాములు, బెల్లం 240 గ్రాములు, ఖర్జూరం 250 గ్రాములు, పాలు 5 లీటర్లు, గుడ్లు 25 చొప్పున అందజేశారు. నవ జాత శిశువు జన్మించిన అరగంటలోపే తల్లి పాలు తాగించాలన్నారు. ఐసీడీఎస్ పామర్రు ప్రాజెక్టు సీడీపీవో వీ భానుశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీలో తాడిశెట్టి శ్రీనివాసరావు, పీ రత్నకుమారి, వెంకటేశ్వరమ్మ, కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనాల కృపావతి, ఎంపీడీవో వై.రామకృష్ణ, సూపర్‌వైజర్ విజయకుమారి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠకరమని తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సాయిప్రసన్న తెలిపారు. మండలంలోని భద్రిరాజుపాలెం గ్రామ సచివాలయంలో తల్లి పాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. తల్లి పాలు పిల్లలకు దివ్యౌషధం లాంటివని, పుట్టిన గంట లోపల ముర్రుపాలు తప్పక పట్టించాలని సాయిప్రసన్న సూచించారు. సర్పంచ్ కొక్కిలిగడ్డ హేమలత, ఎంపీహెచ్‌ఈఓ మాణిక్యం, హెచ్‌వీ రోహిణి, ఎంపీహెచ్‌ఏ శివరామకృష్ణ, ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో మాట్లాడుతున్న ఎంపీపీ రాజామణి, అధికారులు



పామర్రులో టీహెచ్‌ఆర్ కిట్లను అందజేస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్, జెడ్పీటీసీ



పమిడిముక్కలలో టీహెచ్‌ఆర్ కిట్లను అందజేస్తున్న ఎంపీపీ సుప్రజ, తహసీల్దార్

పమిడిముక్కల: అంగన్‌వాడీల్లో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నారని ఎంపీపీ కాసాని వేద సుప్రజ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీటీసీ వంశీ, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ విక్టర్‌పాల్‌తో కలిసి ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలకు కిట్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పమిడిముక్కల సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. చోరగుడిలో సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, శ్రీరంగపురంలో సర్పంచ్ డి.పద్మావతి టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాలను ప్రారంభించారు.

వరిలో సంరక్షణ చర్యలు చేపట్టాలి

ముదినేపల్లి రూరల్: ముంపు బారినపడ్డ వరి పొలాలను కాపాడుకునేందుకు సంరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండలంలోని సింగరాయపాలెం, శ్రీహరిపురం గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపు బారిన పడ్డ పొలాలను ఏలూరు డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు కే ఫణికుమార్, టి.సుజాత, ఎ.రాజేష్, పి.లలితాసుధా, మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పొలాల్లోని మురుగు నీరు సాధ్యమైనంతవరకు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. వరినాట్లు వేయాల్సిన రైతులు నారుమడి యాజమాన్య పద్ధతులు చేపట్టాలన్నారు. నారు తీయడానికి ముందు ఒక సెంటు నారుమడికి 160 గ్రాముల వంతున కార్బండిజం 3జీ గుళికలు వేసుకోవాలన్నారు. దీని వల్ల కాండం తొలుచు పురుగు నివారించవచ్చని చెప్పారు. ముదురు నాట్లు వేసే రైతులు చదరపు మీటరుకు ఎక్కువ కుదుళ్లు ఉండేలా కుదురుకు 3 నుండి 4 మొక్కలు చొప్పున దగ్గరదగ్గరగా నాట్లు వేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు శాస్త్రవేత్తల ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేసినప్పటికీ ఎలాంటి ఫలితం ఉండదని, ఇప్పటికే పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయినందున ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని కోరారు.



సింగరాయపాలెంలో నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

లబ్ధిదారులకు ఇంటితాళాలు అందజేత

గుడివాడ టౌన్: అన్ని వసతులతో కూడిన టిడ్కో ఇళ్లు నిర్మించి తాళాలు అందజేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం 250 మంది లబ్ధిదారులకు ఇంటి తాళాలతో పాటు ఇంటి హక్కుపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆధ్వర్యంలో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అంచలంచెలుగా అందజేస్తున్నామన్నారు. ప్రతి లబ్ధిదారునికి వారికి కేటాయించిన ఇంటిని తొలుత చూపించి అన్ని వసతులు ఉన్నట్లు సంతృప్తి చెందిన అనంతరమే తాళాలు అందజేస్తున్నామన్నారు. కేవలం తన నివాసానికి కావలసిన వస్తువులను తీసుకువెళ్లి జీవనం సాగించే రీతిలో ఇక్కడ వసతులు ఏర్పాటు చేశామన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ప్రధాన కార్యదర్శి చింతల భాస్కరరావు, నాయకులు అల్లం రామ్మోహనరావు, దుడ్డు చిన్నా, వెంపల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఇంటి తాళాలు, హక్కు పత్రాలు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ తదితరులు

స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యం

గుడివాడ టౌన్ (నందివాడ): ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. నందివాడ మండలం కుదరవల్లి గ్రామంలో బుధవారం జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా నీటి సరఫరా పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందివాడ మండలంలో అనేక గ్రామాల్లో చేపల చెరువులు ఉండటంతో నీరు కలుషితమై ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని గమనించిన గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి సహకారంతో రూ.81 లక్షల ఖర్చుతో ఇక్కడ ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీంతో పాటు ప్రస్తుత నీటి అవసరాలు తీర్చేందుకు రూ.11 లక్షలు ఎమ్మెల్యే నిధులు, రూ.2 లక్షలు పంచాయతీ నిధులతో ప్రస్తుతం బోరు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందు కొరకు జనార్ధనపురం సమీపంలో 106 ఎకరాల భూమిని కొనుగోలు చేశామన్నారు. అక్కడ మంచి నీటి చెరువును, పంప్‌హౌస్, ఫిల్టర్ బెడ్‌లు ఏర్పాటు చేసి ప్రతి గ్రామానికీ నేరుగా నీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల ఆదాం, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, తహసీల్దార్ వి.భవన్నారాయణ, ఎంపీడీఓ కేవీ కోటేశ్వరరావు, సర్పంచ్ వసంతల సత్యవతి, వైస్ ఎంపీపీ పూడి సుధాకర్, ఎంపీటీసీ గుజ్జుల చైతన్యజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు వసంతల కృష్ణ, గుజ్జుల లాజరు, కందుల నాగరాజు, విరివాడ సర్పంచ్ గూడపాటి అశోక్, గ్రామ కార్యదర్శి పి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ ఏర్పాటు చేయాలని వినతి

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం లిఫ్ట్ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శేకు బోయిన సుబ్రహ్మణ్యం కోరారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయంలో వల్లభనేని బాలశౌరిని కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. రైల్వేస్టేషన్‌లో మెట్ల మార్గం ద్వారా ప్లాట్‌ఫారం మారడానికి వృద్ధులు, దివ్యాంగులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గతంలో మచిలీపట్నం నుంచి తిరుపతికి ప్రతి రోజూ రైలు సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం రోజు విడిచి రోజు నడపటం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు మురాల వెంకటేశ్వరరావు, ధనికొండ చిన్ని, బోయిన రమేష్, జన్ను గోవిందు, ఎం. పవన్ పాల్గొన్నారు.

చెరువు సాగు హక్కుల వేలం



మండవల్లి: మండలంలోని అయ్యవారిరుద్రవరం గ్రామంలో బుధవారం చేపల చెరువుల బహిరంగ వేలం నిర్వహించారు. ఈఓపీఆర్డీ బి.ఆనందబాబు పర్యవేక్షణలో వేలం జరిగింది. మూడు చెరువులకు సంబంధించి పావురాల అంజియ్యానాయుడు, ఇంటి నాగరాజు, కరేటి వెంకటరాజు రూ.2 లక్షలకు పాడుకున్నట్లు ఈఓపీఆర్డీ ఆనందబాబు పేర్కొన్నారు. గడ్డి వేలం నిర్వహించగా రూ.29 వేలకు దేశి ఏడుకొండలు పాడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బోనం శేషగిరిరావు, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు ముగిసిన శిక్షణ



నిమ్మకూరు(పామర్రు): జిల్లాలో కొత్తగా ఎంపిక చేసిన 105 మంది ఆశా కార్యకర్తలకు మండలంలోని నిమ్మకూరు గ్రామంలో నందమూరి తారక రామారావు నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కేంద్రం (మహిళా ప్రాంగణం)లో గత 8 రోజులుగా నిర్వహిస్తున్న ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ డాక్టర్ ఎస్ జుబేదా పర్వీస్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజల ఆరోగ్య అవసరాలను ప్రతి నిత్యం తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో ఆనారోగ్య సమస్యలు ఉత్పన్నమయినప్పుడు వైద్యశాలలకు తరలించాలని అన్నారు. శిక్షణలో ఇచ్చిన అంశాలను తప్పకుండా పాటించాలని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి ఆధ్వర్యంలో డీపీ హెచ్‌ఎస్ దీవెనమ్మ, తదితరులు శిక్షణ ఇచ్చారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించండి



కైకలూరు: అంకితభావంతో విధులు నిర్వహించే ఉద్యోగులు అన్ని చోట్లా గౌరవింపబడతారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. బుధవారం కైకలూరు ఎమ్మెల్యే కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తగా ఉద్యోగోన్నతి పొందిన గంటా చిన్న తల్లి (కైకలూరు), అంగన్‌వాడీ ఆయాలుగా చీమల శ్యామల (కైకలూరు), అడుసుమిల్లి భవాని (కైకలూరు), నాగేళ్ళ ఆషిత (మండవల్లి), కోసూరి శశికళ (పెనుమల్లి), గరికిముక్కు జమాయమ్మ (భుజబల పట్నం), సిద్దుల జ్యోతి (పెయ్యేరు), జన్ను నాంచారమ్మ (అప్పారావు పేట), పల్లపాటి మాధవి (గోపవరం)లకు నియామక పత్రాలను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో సీడీపీవో ఆనంద్, సూపర్‌వైజర్లు లావణ్య, ఖానుమ్, మల్లీశ్వరి, గోపవరం సర్పంచ్ ఉలిసి వసంతకుమారి, మండల కో–ఆప్షన్ సభ్యులు సోమల శ్యామ్‌సుందర్, నాయకులు గురజాల వేణు పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- చినపారుపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం

చినపారుపూడి(పెదపారుపూడి): దేశంలో ఎక్కడ లేని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అభివృద్ధి చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని చినపారుపూడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను అందించారు. ఎస్సీ కాలనీకి వచ్చే రోడ్డు పై ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉందని స్థానిక మహిళలు ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను అదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను 98 శాతానికిపైగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో శక్తి వంచన లేకుండా అభివృద్ధి పనులు చేశామన్నారు. మరోసారి వైఎస్సార్ సీపీ పార్టీకి ఓటు చేసి నన్ను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఎంపీపీ గోగం సురేష్, తహసీల్దార్ వి.నాగభూషణం, మండల సచివాలయాల కన్వీనర్ జాజుల చిన్నారి, పామర్రు మార్కెట్ యార్డు డైరక్టర్లు గోళ్ళ వెంకటేశ్వరరావు, చేబ్రోలు సుజాత, పీఏసీఎస్ బ్యాంక్ అధ్యక్షుడు తుమ్మల కోటేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు మూల్పూరి హరీష, సర్పంచ్‌లు నగుళ్ళ శ్రీనివాసరావు, జువ్వనపూడి రాజు, పాతూరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులుచోరగుడి ఇజ్రాయిల్, వేమూరి విద్యాసాగర్, మొవ్వా శ్రీనివాసరావు, జాజుల నాగమల్లేశ్వరావు, గుంజ సుధాకర్, కంచార్ల కరుణకర్, విద్యాసాగర్, ఆల రమేష్, చిగురుపాటి శ్రీధర్, మూల్పూరి చంద్రశేఖర్, చిగురుపాటి శ్రీధర్, జాజుల నాగరాజు, నమా వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సగుర్తి నరేష్, వీఆర్వో కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ఎంపీపీ గోగం సురేష్

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



పింగళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ అపరాజిత సింగ్



వెంకయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రఫీ తదితరులు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు

భట్లపెనుమర్రు(మొవ్వ): పింగళి వెంకయ్య జీవితం నేటి విద్యార్థులకు, యువతకు ఆదర్శనీయం అని కృష్ణా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అపరాజిత సింగ్ విద్యార్థులకు సూచించారు. జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఆయన జన్మస్థలమైన మొవ్వ మండలం భట్లపెనుమర్రులో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామ ప్రధాన కూడలిలోని పింగళి విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. జేసీకి అధికారులు, ప్రజా ప్రతినిధులుతో పాటు విద్యార్థులు జాతీయ పతాకాన్ని చేత పట్టుకుని ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె విద్యార్థులతో మాట్లాడారు. వెంకయ్య జీవిత చరిత్రపై విద్యార్థులను ప్రశ్నించి, ఆయన జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, సర్పంచ్ మట్టా ఇందిర, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్, ఈవో డేగలజాన్సి, వీఆర్‌వో దగాని గోపి, జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జుఝవరం(పామర్రు): జాతీయ పతాక రూపశిల్పి కృష్ణా జిల్లా మొవ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామ వాసి పింగళి వెంకయ్య జయంతిని మండల పరిధిలోని జుఝవరం గ్రామంలోని ఉషోదయ హైస్కూల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. 100 అడుగుల జాతీయ పతాకంతో గ్రామంలో ర్యాలీ చేశారు. తొలుత వెంకయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ రఫీ మాట్లాడుతూ వెంకయ్య త్యాగనిరతి, దేశ భక్తిని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వ్యక్తిత్వ వికాసం కోసం స్వచ్ఛమైన దేశ భక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.


వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

భట్లపెనుమర్రు(మొవ్వ): జాతీయ పతాక సృష్టికర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన భట్లపెనుమర్రులో బుధవారం కూచిపూడి రోటరీ క్లబ్ సభ్యులు వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ముందుగా గ్రామ ప్రధాన కూడలిలోని పింగళి వెంకయ్య, జాతిపిత గాంధీజీ విగ్రహాలకు పూల మాలలేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనియన్ బ్యాంక్ మేనేజరు ఎస్.ధనకుమార్ పాల్గొన్నారు. పింగళి సేవలను కొనియాడారు. రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కే రామాంజనేయులు, రవిబాబు, సర్పంచ్‌లు అమరబాలేశ్వరరావు, కే అన్నామణి, రోటరీ సభ్యులు కోనేరు మంజునాథ్, పాగోలు రమేష్‌బాబు, భట్లపెనుమర్తి శేష సాయి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఐటీఐలో రెండో విడత కౌన్సెలింగ్

గుడివాడ టౌన్: స్థానిక బీకేఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను రెండో విడత అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.హరిధర్మేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4వ తేదీ నుంచి అడ్మిషన్లు కొనసాగుతాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. మెరిట్ నంబర్ ఒకటి నుంచి 85 వరకు మధ్యాహ్నం ఒంటి గంట వరకు కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 86–147 మధ్య ర్యాంకుల వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుందన్నారు. అడ్మిషన్‌ల కొరకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఏ విధమైన రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మిగిలిన వారు రూ.60 కాషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. అడ్మిషన్ కోరువారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్, కుల ధ్రువీకరణపత్రం, టీసీలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 9908518799, 9346118232లో సంప్రదించవలసిందిగా కోరారు.

ఎంపీడీఓగా విక్టర్‌పాల్



పమిడిముక్కల: పమిడిముక్కల ఎంపీడీఓగా సీహెచ్ విక్టర్‌పాల్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక(నెల్లిపాక) మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు మొవ్వ మండల ఎంపీడీఓ సుధాప్రవీణ్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. సంవత్సరకాలం పాటు ఇన్‌చార్జిగా ఉన్నారు. విక్టర్‌పాల్‌కు ఈఓఆర్డీ కె. వెంకటేశ్వరరావు, మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు స్వాగతం పలికారు.